క్లుప్తంగా

ఆదర్శప్రాయుడు సుందరయ్య



సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

పరవాడ: దివంగత సీపీఎం నేత పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్ర పటానికి సీపీఎం నాయకులు ఎస్. రమణ, పి.మాణిక్యం, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం గనిశెట్టి మాట్లాడుతూ ఆదర్శ కమ్యూనిస్టుగా, అజాతశత్రువుగా పిలవబడే సుందరయ్య నేటి తరానికి ఆదర్శప్రాయుడన్నారు. పార్లమెంటులో తొలి ప్రతిపక్ష నేతగా మన్ననలు పొందారన్నారు. ప్రజాసేవ కోసం పిల్లలే వద్దనుకున్న త్యాగశీలి అని కొనియాడారు. తన ఆస్తిని పార్టీకిచ్చి పేద ప్రజల కోసం నిరంతరం శ్రమించిన ఆదర్శమూర్తి అని శ్లాఘించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.రమణ, నాయకులు తరుణ, జీవీఎస్ తేజ, కె. మనోజ్, రమణ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం నేడు

పరవాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో వి.హేమసుందర్రావు చెప్పారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కానున్న సమావేశానికి మండలంలోని ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

ఆన్‌లైన్ పుస్తకాలను సద్వినియోగం చేసుకోండి



ఆన్‌లైన్ లింక్ ద్వారా పాఠ్యపుస్తకాలు డౌన్‌లోడ్‌ను వివరిస్తున్న ఎంఈవో అప్పలరాజు

సబ్బవరం: పాఠశాలలు తెరిచేవరకూ విద్యార్థులు ఆన్‌లైన్‌లో తరగతుల వారీగా పొందుపరిచిన పాఠ్యపుస్తకాలను డౌన్‌లోడ్ చేసుకుని చదువుకోవాలని మండల విద్యాశాఖాధికారి ఎస్. అప్పలరాజు తెలిపారు. ఒకటో తరగతి నుంచి 9వ తరగతి వరకూ తరగతుల వారీ డౌన్‌లోడ్ చేసి చదువుకునేందుకు సౌలభ్యంగా ఈ పాఠ్యపుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు నేర్చుకునేందుకు వీలవుతుందని,అందుకు ఉపాధ్యాయులు విద్యార్థులకు తగిన సూచనలు చేయాలని కోరారు. దీనిలో భాగంగా శుక్రవారం సబ్బవరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆన్‌లైన్ లింక్ ద్వారా ఏ విధంగా పాఠ్యపుస్తకాలు డౌన్‌లోడ్ చేసుకోవాలో ఆయన వివరించారు. ఎంఐఎస్ కో ఆర్డినేటర్ మహేష్, ఆర్‌పీ రమణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉపాధ్యాయుల శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న డైట్ ప్రిన్సిపాల్ మాణిక్యం నాయుడు

సింహాచలం: విద్యార్థుల శ్రేయస్సే లక్ష్యంగా ఉపాధ్యాయులు పని చేయాలని డైట్ ప్రిన్సిపాల్ మాణిక్యం నాయుడు సూచించారు. పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐదు రోజులుగా నూతన ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. మాణిక్యం నాయుడు మాట్లాడుతూ నూతనంగా ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించిన వారంతా శిక్షణలో నేర్చుకున్న అంశాలను బోధనలో అమలు చేయాలన్నారు. శిక్షణ కార్యక్రమం రాష్ట్ర పరిశీలకుడు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయులంతా అంకితభావంతో పాఠశాల స్థాయిలో కార్యక్రమాలు అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డైట్ వైస్ ప్రిన్సిపాల్ సుధాకర్, అధ్యాపకుడు కె.రవి తదితరులు పాల్గొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు అందజేశారు.

బాబువి అహంకారపూరిత వ్యాఖ్యలు

- సెంటు భూమిలో శవాన్ని పూడ్చుతారా?
- పేదలంటే ఎందుకంత అసహ్యం..
- చంద్రబాబు మాటలపై ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మండిపాటు



పెందుర్తి జంక్షన్‌లో ఇళ్ల లబ్ధిదారులతో కలిసి నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: పేదలందరికీ సొంతగూడు కల్పించాలన్న మహోన్నత లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదలకు అందిస్తున్న సెంటు భూమి శవాన్ని పూడ్చడానికి సరిపోతుందని టీడీపీ అధినేత చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు ఆయన అహంకారానికి నిదర్శనమని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మండిపడ్డారు. చంద్రబాబు మాట్లాడిన తీరును నిరసిస్తూ జగనన్న ఇళ్ల స్థలాల లబ్ధిదారులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి శుక్రవారం సాయంత్రం పెందుర్తి జంక్షన్‌లో అదీప్‌రాజ్ మానవహారం, నిరసన చేపట్టారు. సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి ఇళ్లస్థలాల లబ్ధిదారులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన ప్రతీ పేదవాడి సొంతింటి కల నెరవేర్చే కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఇళ్ల పట్టాలు అందించి ఇళ్లు నిర్మిస్తున్నారన్నారు. సొంతిళ్లు వచ్చిన ఆనందంలో పేదలు ఉన్న సమయంలో చంద్రబాబు సెంటు స్థలం శవాన్ని పూడ్చడానికి సరిపోతుందని వెటకారంగా మాట్లాడడంతో పేదల మనసులు బాధపడ్డాయన్నారు. పేదలు ఇప్పుడు కట్టుకుంటున్న ఇల్లు వారికి ప్యాలెస్‌తో సమానమని, అలాంటి పేదల మనోభావాలను కించపరిచే విధంగా చంద్రబాబు మాట్లాడారన్నారు. పేదలంటే బాబుకు చులకన భావమో ఆయన వ్యాఖ్యలతో మరో సారి రుజువైందన్నారు.

పేదలకు స్థలాలు అందకుండా అడ్డుపుల్ల

విశాఖపట్నంలో ఇళ్లపట్టాలు ఇవ్వకుండా చంద్రబాబు డైరెక్షన్‌లో కోర్టుకెళ్లి ఏవిధంగా అడ్డుకున్నారో అందరికీ తెలుసునన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కోర్టులో పోరాడి ఇళ్ల పట్టాలు అందించే కార్యక్రమం చేపట్టారన్నారు. ఉత్తరాంధ్ర ద్రోహి చంద్రబాబు జాగ్రత్తగా మాట్లాడాలని, ఖబడ్దార్ చంద్రబాబు అంటూ నినదించారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా.. ఎన్ని కేసులు వేసినా జగన్‌మోహన్‌రెడ్డి పేదల సొంతింటి కల నెరవేరుస్తారన్నారు.

బాబు హయాంలో పేదలకు పట్టాలిచ్చారా ..

చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సొంత పార్టీ నేతలకు మినహా ఒక్క పేదవాడికైనా ఇంటి పట్టా ఇచ్చారా అని అదీప్‌రాజ్ ప్రశ్నించారు. ఈరోజు జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తుంటే ఓర్వలేని చంద్రబాబు మతి భ్రమించి మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు నక్క కనకరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు శరగడం నరసింహ మూర్తి, 94,97వ వార్డుల అధ్యక్షులు ఆదిరెడ్డి మురళి, మెంటి మహేష్, 93వవార్డు నాయకుడు దాసరి రాజు, పార్టీ నాయకులు ఉగ్గిన గోవింద్, లెక్కల రమేష్, బొడ్డు ప్రకాష్, గొల్లవిల్లి రమణ, కొటాన రాము, కిల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణకు బ్రేక్

- హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు



ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న వీఆర్వో శేషు తదితరులు

సబ్బవరం: మండలంలోని గొల్లలపాలెం గ్రామంలో ప్రభుత్వ భూమి ఆక్రమణకు రెవెన్యూ అధికారులు బ్రేక్ వేశారు. ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని శుక్రవారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. వివరాలు.. మండలంలోని గొల్లలపాలెం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 268లో ఉన్న జిరాయితీ భూమిని రైతుల నుంచి రియల్టర్లు కొనుగోలు చేశారు. సదరు జిరాయితీ భూమి 268 సర్వే నెంబర్‌లో 268–2 నుంచి 268–8 వరకూ సబ్ డివిజన్లలో ఉండగా అదే జిరాయితీ భూమిని ఆనుకుని సర్వే నెంబర్ 268–9లో 1.53 ఎకరాల ప్రభుత్వ భూమి(గయాలు) ఉంది. లక్షలాది రూపాయిల విలువ చేసే ఈ ప్రభుత్వ భూమిపై రియల్‌ఎస్టేట్ వ్యాపారుల కళ్లు పడ్డాయి. దీంతో దొరికిందే అవకాశంగా ప్రభుత్వ భూమిని మూడు రోజులుగా చదును చేసి ట్రాక్టర్లతో దున్నేసి ఆక్రమణకు పాల్పడుతున్నారు. దీంతో స్థానిక రైతులు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. తహసీల్దార్ బి. సత్యనారాయణ ఆదేశాల మేరకు డిప్యూటీ తహసీల్దార్ వెంకట్, వీఆర్వో పూడి శేషు, విలేజ్ సర్వేయర్ హరి భూమిని సర్వే చేశారు. ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 268/9లో ఉన్నట్లు గుర్తించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ వెంకట్ మాట్లాడుతూ సర్వే నెంబర్ 268/1లో జగనన్న కాలనీ లే అవుట్ వేశామని,సర్వే నెంబర్ 268/9లో 1.53 ఎకరాల ప్రభుత్వ భూమి ఖాళీగా ఉందన్నారు. ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఇకపై ఎవరైనా ఆక్రమించడానికి ప్రయత్నిస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన వారిలో రెవెన్యూ సిబ్బంది ముదపాక అప్పారావు తదితరులు ఉన్నారు.

విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం,జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. ఆలయ అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు, శ్రీకాంత్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

విద్యార్థులకు సంగీతంలో శిక్షణ



సంగీతంపై శిక్షణ ఇస్తున్న కామేశ్వరావు తదితరులు

సింహాచలం: అడవివరం గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో శుక్రవారం విద్యార్థులకు సంగీతంపై శిక్షణ ఇచ్చారు. ఆధ్యాత్మిక వేత్త డి.కామేశ్వరరావు మాట్లాడుతూ జీవిత అధ్యయనంలో సంగీతం ఒక భాగమని, సాధనతోనే ఏదైనా సాధించగలమని విద్యార్థులకు తెలియజేశారు. గ్రంథాలయ రీడర్స్ ఫోరం కమిటీ అధ్యక్షుడు బి.బి.రాజేంద్రప్రసాద్ విద్యార్థులకు మెడిటేషన్, నీతి కథలు నేర్పించారు. కార్యక్రమంలో కార్మికనేత సీహెచ్.ఎస్ఎన్.రాజు, గ్రంథాలయాధికారి ఎన్.వి.నరసింహం, ఉద్యోగి ఎల్లమ్మ, న్యాయవాది కె.రామకృష్ణ, వక్త భాను, పాఠకులు బి.సూర్యమోహన్, ఎం.అజయ్, కిరణ్‌కాంత్ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతో సంతృప్తి



మందులు అందజేస్తున్న సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు

సింహాచలం: సేవా కార్యక్రమాలతో సంతృప్తి లభిస్తుందని పెందుర్తి పీఏసీఎస్ అధ్యక్షుడు శరగడం నరసింహమూర్తి అన్నారు. సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చింతలగ్రహారంలో శుక్రవారం నిర్వహించిన పలు సామాజిక కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ట్రస్ట్ సహకారంతో ఆర్.కె.ఓమ్ని , బ్రింద మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి, క్యాన్సర్ హాస్పటల్, శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి, మంగమ్మ దంత వైద్యశాలలకు చెందిన వైద్యులు 400 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే గ్రామస్తుల సౌకర్యార్థం మూడు పెద్ద చెత్త కుండీలు అందజేశారు. చీమలాపల్లి బ్రిడ్జి వద్ద ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన బస్ షెల్టర్ ప్రారంభించారు. షెల్టర్‌లో సిమెంట్ బల్లలు ఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటీ అధ్యక్షుడు దాడి శ్రీను, సారధి కన్సల్టెన్సీ సీఈవో సూర్యారావు, చింతలగ్రహారం సర్పంచ్ దాడి గోపి , మాజీ సర్పంచ్ ఆళ్ల తాతారావు, వైస్ సర్పంచ్ భీశెట్టి భాగ్య శంకరం రావు, మాజీ ఎంపీపీ వరలక్ష్మి, మద్దాల శ్రీనివాస రావు, ట్రస్ట్ సభ్యులు కె.నాగసూర్యప్రసాద్, కొణతాల షణ్ముఖ, అంజి, మహేశ్వరరావు, ఉమాశంకర్ పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులపై సత్వర చర్యలు చేపట్టాలి

డాబాగార్డెన్స్: స్పందన ద్వారా వచ్చిన ఫిర్యాదులపై సత్వర చర్యలు చేపట్టాలని పట్టణ ప్రణాళికా అధికారులను ఆదేశించినట్టు కమిషనర్ సాయికాంత్‌వర్మ తెలిపారు. జీవీఎంసీ పరిధి 8 జోన్లలో ఎటువంటి అనధికార నిర్మాణాలు చేపట్టినా, నిబంధనలు ఉల్లంఘించి భవనాలు నిర్మించినా, భవన నిర్మాణ వ్యర్థాలు, టౌన్‌ప్లానింగ్ విభాగంపై ఎటువంటి ఫిర్యాదు చేయాలన్నా టోల్ ఫ్రీ నంబరు 1800 4250 0009కు ఫోన్ చేసి నేరుగా సమస్య తెలపవచ్చు. లేదా జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫోన్ నంబరు 8187897569కు తెలిపి పూర్తి వివరాలు (డోరు నంబరు, వార్డు నెంబరు, చిరునామా, సమస్య వివరాలు) వాట్సప్‌కు పంపితే సంబంధిత జోన్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ ద్వారా పై అధికారులకు నివేదించి, సమస్యపై సత్వర చర్యలు చేపట్టనున్నట్టు ప్రధాన సిటీ ప్లానర్ బి. సురేష్‌కుమార్ తెలిపారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం టౌన్‌ప్లానింగ్‌పై స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందనలో జోన్–2 నుంచి రెండు, జోన్–3, 4, 5 నుంచి ఒక్కో ఫిర్యాదు వచ్చాయి. కార్యక్రమంలో డీసీపీలు, ఏసీపీలు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, డబ్ల్యూపీఆర్ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలపై వినతి

అక్కిరెడ్డిపాలెం: సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై యూసీడీ ప్రాజెక్ట్ డైరెక్టర్ పాపునాయుడుకు డెమోక్రటిక్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం గాజువాకలో జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జి.జోసెఫ్ కిషోర్, విశాఖ జిల్లా కమిటీ అధ్యక్షుడు డీఏ సూర్య మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న సచివాలయ ఉద్యోగులకు ఇన్‌చార్జి విధుల్లో వెసులు బాటు కల్పించాలని కోరారు. వెల్ఫేర్ సెక్రటరీలు, ఎడ్యుకేషన్ సెక్రటరీలకు బీఎల్‌వో డ్యూటీల నుంచి మినహాయింపు ఇవ్వాలని , దివ్యాంగుల కోటాలో పని చేస్తున్న వెల్ఫేర్ సెక్రటరీలకు పెన్షన్ అమౌంట్ బ్యాంకు నుంచి తీసుకురావటానికి ఒకరిని సహాయకునిగా నియమించాలని కోరారు. సీడీవో సూర్యనారాయణ, అసోసియేషన్ సభ్యులు వెంకట్రావు, జె.సమరం పాల్గొన్నారు.

వాతావరణ శాస్త్ర నిపుణులకు విస్తృత అవకాశాలు



ప్రసంగిస్తున్న రిజిస్ట్రార్ కృష్ణమోహన్

ఏయూ క్యాంపస్: వాతావరణ శాస్త్ర నిపుణులకు విస్తృత అవకాశాలు ఉన్నాయని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. శుక్రవారం సముద్ర వాయు పేరుతో నిర్వహించిన విభాగ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ఏయూ దశాబ్దాలుగా ఈ రంగానికి ఎందరో నిపుణులను అందిస్తోందన్నారు. సముద్ర అధ్యయన శాస్త్రం ఎంతో సంక్లిష్టమైందన్నారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ కోర్సు అభ్యసించిన విద్యార్థులకు దేశ, విదేశాల్లో సైతం ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. విభాగాధిపతి పి.సునీత, విభాగ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

25న అప్రెంటిస్, ఉద్యోగాలకు ఎంపికలు

పెదగంట్యాడ: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో అన్ని ట్రేడుల్లో శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 25న అప్రెంటిస్, ఉద్యోగాలకు ఎంపికలు నిర్వహించనున్నామని ప్రభుత్వ ఐటీఐ స్టీల్‌సిటీ ప్రిన్సిపాల్ లండ సుధాకరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాన్సన్ లిమిటెడ్ కంపెనీ కోసం ఈ ఎంపికలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు రెండు జతల బయోడేటాతో పాటు ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో ఈ నెల 25 ఉదయం 9.30 గంటలకు ప్రభుత్వ ఐటీఐ (న్యూ) స్టీల్‌సిటీలో హాజరు కావాలని కోరారు.

శ్రావణికి యోగా శిరోమణి పురస్కారం



శ్రావణిని అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా విభాగ పరిశోధకురాలు డాక్టర్ చిట్టూరి శ్రావణికి ప్రతిష్టాత్మక యోగా శిరోమణి పురస్కారం లభించింది. ఈ సందర్భంగా శ్రావణిని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. నెల రోజుల పాటు ఉత్తర కాశీలో యోగ వేదాంత ఫారెస్ట్ అకాడమీ, శివానంద యోగ వేదాంత ఆశ్రమం ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని కఠోర యోగా సాధన చేశారు. యోగాకు విస్తృత ప్రాచుర్యం తీసుకురావడానికి శ్రావణి చేస్తున్న కృషిని గుర్తిస్తూ శివానంద యోగ వేదాంత ఆశ్రమం యోగ శిరోమణి పురస్కారంతో సత్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, చిట్టూరి శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

సేవలకు సలాం

- ప్రతిభ చూపిన వలంటీర్లకు పురస్కారాలు



కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి నుంచి సేవా వజ్ర పురస్కారం అందుకున్న పూర్ణిమ తదితరులు

సబ్బవరం: ప్రజలకు – ప్రభుత్వానికి మధ్య వారధులుగా ఉంటూ లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు చేరవేస్తున్న వార్డు వలంటీర్లను ప్రభుత్వం గుర్తించింది. ఉత్తమ సేవలందిస్తున్న వలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులతో పాటు నగదు పురస్కారాలు ప్రకటించింది. వలంటీర్ వ్యవస్థ ఏర్పాటైన తర్వాత వరుసగా మూడో ఏడాది వలంటీర్లకు వందనం పేరిట పురస్కారాలు ప్రకటించంపై వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పేరిట మూడు కేటగిరీల్లో ఎంపికైన వారికి రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేల చొప్పున నగదు బహుమతులు వలంటీర్ల బ్యాంకు ఖాతాలో జమకానున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడలో శుక్రవారం అవార్డుల ప్రదానోత్సవాన్ని లాంఛనంగా ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా పది రోజుల పాటు జరిగే ఈ పురస్కారాల కార్యక్రమంలో వలంటీర్ల ఖాతాలో నగదు ప్రోత్సాహకాలు జమ చేస్తారు. దీంతోపాటు ఉత్తమ వలంటీర్‌గా ఎంపికైన వారికి ప్రశంసాపత్రం, బ్యాడ్జి, శాలువాతో సత్కరించనున్నారు. గడిచిన ఏడాదిలో వలంటీర్లు చూపిన పనితీరే ప్రామాణికంగా పురస్కారాలకు ఎంపిక చేశారు. సబ్బవరం మండలంలోని అమృతపురం గ్రామ వలంటీర్ బైలపూడి పూర్ణిమ, పరవాడ మండలం నాయుడు పాలెం గ్రామానికి చెందిన రాజాన జయలక్ష్మి, రావాడ గ్రామానికి చెందిన కుర్ని రవి యాదవ్ సేవలకు గుర్తింపు లభించింది. వీరికి సేవ వజ్ర పురస్కారం వరించింది. అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎంపీ సత్యవతి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నారు.

పరవాడ మండలంలో...

పరవాడ: మండలంలోని నాయుడుపాలెం, రావాడ తానాం –1, తానాం–2 వలంటీర్లు రొంగలి రాణి, ఎ. హైమావతితో పాటు నాయుడు పాలెం వలంటీర్ మాసవరపు విజయ, వెన్నలపాలెం వలంటీర్ పి.ధనలక్ష్మితో పాటు వాడచీపురుపల్లి వలంటీర్ మాసవరపు నాగమణి సేవా రత్న పురస్కారాలకు ఎంపికయ్యారు.

వలంటీర్లకు సన్మానం

సింహాచలం: రాంపురంలోని తన కార్యాలయంలో పురస్కారాలకు ఎంపికైన రాంపురం,పెదగాడి గ్రామ వలంటీర్లను ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సత్కరించారు. కార్యక్రమంలో రాంపురం సర్పంచ్ అన్నం రెడ్డి శిరీష ,పెదగాడి సర్పంచ్ కేశబోయిన త్రినాథ్, ఎంపీడీవో వెంకటరమణ, నాయకులు శ్రీరాములు, బాదిరెడ్డి కృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

గర్వంగా ఉంది



మండలంలో సుమారు 366 మంది వలంటీర్లు ఉన్నారు. నాకు ఈ అరుదైన అవకాశం లభించడం ఎంతో గర్వంగా ఉంది.నా క్లస్టర్‌లో 58 హౌస్ హోల్డ్స్ ఉండగా వారందికీ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సేవలు, పథకాలు అందిస్తున్నాం. ఈ పురస్కారానికి ఎంపిక కావడంతో నాపై మరింత బాధ్యత పెరిగింది. మరింత సమర్థవంతంగా ప్రభుత్వ పథకాలను,సేవలను ఇంటింటికీ చేరవేస్తాను.

–బైలపూడి పూర్ణిమ, గ్రామ వలంటీర్,అమృతపురం గ్రామం



పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో ఎమ్మెల్యే అదీప్‌రాజ్, సర్పంచ్ శిరీష

వేదగాయత్రీదేవి ఆలయ వార్షికోత్సవానికి ఏర్పాట్లు



వేద గాయత్రీదేవి

సింహాచలం: జీవీఎంసీ 94వవార్డు నాయుడులోని వేద గాయత్రీదేవి ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు శనివారం నుంచి వరకు రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్టు ఆలయ ధర్మకర్త రాపర్తి త్రివేణి వరప్రసాద్ తెలిపారు. శనివారం ఉదయం 6 నుంచి 8గంటల వరకు అమ్మవారి వేలుకొలుపు, నిత్యార్చన, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాశనం, దీక్షాధారణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఉదయం 9 గంటలకు అమ్మవారి అష్టోత్తర శత కలశ స్థాపన, లక్ష్మీగణపతి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పంచామృతాభిషేకం నిర్వహిస్తామన్నారు. ఆదివారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు అమ్మవారి మేలుకొలుపు, నిత్యార్చన, అగ్నికార్యం, సహస్ర గాయత్రీ మంత్ర హవనం, ఉపదేవతా సహిత నవగ్రహ మంత్ర సూక్తహవనాలు, మహా పూర్ణాహుతి, ప్రసాద వితరణ ,వేద ఆశీర్వచనం ఉంటాయన్నారు. మధ్యాహ్నం 12గంటల నుంచి నారాయణసేవ(అన్నసమారాధన కార్యక్రమం) ఉంటుందని తెలిపారు. భక్తులంతా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

827వ రోజుకు ఉక్కు నిరాహార దీక్షలు



కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు

కూర్మన్నపాలెం: దేశంలోని రైతుసంఘాలు, ప్రజా సంఘాలు, యువజన సంఘాలను కలుపుకొని ప్రతి జిల్లాలోనూ సమావేశాలు నిర్వహించి తద్వారా ఉక్కు ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మలిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు తెలిపారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన ఉక్కు రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 827వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా కమిటీ నాయకులు మాట్లాడుతూ ఈ నెల 22, 23, 24 తేదీల్లో ఉక్కు కర్మాగారంలోని ప్రతి విభాగంలో పోరాట కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నామని, తద్వారా దీక్ష శిబిరంలో కార్మికులు సంఖ్య పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు, విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణకు ప్రతి ఒక్కరు నడుం బిగించాలని, ఉక్కు ఉద్యమంలో భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, కోక్ ఓవెన్ విభాగ ప్రతినిధులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఉక్కు నిర్వాసితులకు ఉపాధి కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పైడిరాజు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ శాశ్వత, కాంట్రాక్టు ఉపాధి లో నిర్వాసితులకు ప్రాధాన్యత కల్పించాలని ఉక్కు శ్రామిక సంఘం ప్రధాన కార్యదర్శి బొడ్డు పైడిరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ కోసం భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులందరికీ ఉపాధి కల్పించకపోవడం అన్యాయమన్నారు. కార్మిక సమస్యల పరిష్కారం కోసం శ్రామిక సంఘం రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. ఈ సందర్భంగా యూనియన్ బలోపేతానికి ఐదు జోన్లుగా నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ప్రధాన కార్యదర్శిగా బొడ్డు పైడిరాజు, గౌరవాధ్యక్షునిగా కరణం సత్యారావు, అధ్యక్షునిగా ఎం. కోటేశ్వరరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మామిడి అప్పారావు, జాయింట్ జనరల్ సెక్రటరీగా కరణం బాలయోగితో పాటు 27 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మొల్లి ప్రకాష్, సమ్మిడి రాజు, బొడ్డు రమణ, కరణం సురేష్ పాల్గొన్నారు.